

రెవెన్యూ పెట్రోల్ బంకు ప్రారంభం


శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న కలెక్టర్ శ్రీధర్

ప్రజాశక్తి-రాయచోటి

రాయచోటిలోని ఎస్‌పి ఆఫీసు పక్కన నూతనంగా నిర్మించిన రెవెన్యూ వెల్ఫేర్ పెట్రోల్ ఫిల్లింగ్ స్టేషన్‌ను కలెక్టర్ శ్రీధర్ చామకూరి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రెవెన్యూ డే రోజున రెవెన్యూ వెల్ఫేర్ పెట్రోల్ ఫిల్లింగ్ స్టేషన్‌ను ప్రారంభించడం సంతోషంగా ఉందని పేర్కొన్నారు. ఐఒసిఎల్, జిల్లా రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో రెవెన్యూ వెల్ఫేర్ పెట్రోల్ ఫిల్లింగ్ స్టేషన్‌ను రాయచోటిలో ఏర్పాటు చేశారని పేరున్నారు. ఈ పెట్రోల్ బంకు ద్వారా పదిమందికి ఉపాధి అవకాశాలు వస్తాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా సంయుక్త కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్, డిఆర్‌ఒ మధుసూదనరావు, మదనపల్లి సబ్ కలెక్టర్ మేఘ స్వరూప్, రాయచోటి ఆర్‌డిఒ శ్రీనివాస్, రాయచోటి తహశీల్దార్ నరసింహ కుమార్, ఐఒసిఎల్ ప్రతినిధులు జయంత్ కుమార్, మణికంఠ పాల్గొన్నారు.

కార్మికులకు పని గంటలు తగ్గించాలి

- నిరసనలో సిఐటియు నాయకులు

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

కార్పొరేట్ల జేబులు నింపడం కోసమే ప్రభుత్వం కార్మికుల పనిగంటలు పెంచిందని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి అబ్బవరం రామాంజులు, మున్సిపల్ యూనియన్ జిల్లా అధ్యక్షులు బి.వి.రమణ అన్నారు. శుక్రవారం రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదురుగా శానిటేషన్, ఇంజినీరింగ్ కార్మికులు మోకాళ్లపై నిలబడి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం అభివృద్ధి పేరుతో 8 గంటల పనిని 10 గంటల వరకు పెంచడంపై అసహనం వ్యక్తం చేశారు. 8 గంటల పని, 8 గంటల నిద్ర ఉంటే మనిషి ఆరోగ్యంగా ఉంటాడని ప్రపంచ ఆరోగ్య సంస్థలు చెబుతున్నప్పటికీ ఎలాంటి సూచనలు లెక్కచేయకుండా కార్పొరేట్ల జేబులు నింపడం కోసం పని గంటలు పెంచారని మండిపడ్డారు. కార్పొరేట్ల జేబులు నింపడం కోసం కార్మికుల, కూలీల శ్రమను దోచి పెట్టడం తగదని పేర్కొన్నారు. మున్సిపల్ కార్మికులకు ఎలాంటి షరతులు లేకుండా తల్లికి వందనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. వాటర్ సెక్షన్ వారికి 36 జిఒ అమలు చేసి పారిశుధ్య వాహనం డ్రైవర్లకు రూ.24,500 వేతనం ఇవ్వాలని తెలిపారు. సమస్యను పరిష్కారం కానీ పక్షంలో జూన్ 23 నుండి ఏ క్షణమైనా సమ్మె చేపట్టడానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కోశాధికారి రాంబాబు, అక్బర్, శంకరయ్య, రమణ, చెన్నయ్య, చంద్రశేఖర్, ఆంజనేయులు, రమేష్ పాల్గొన్నారు. **రాజంపేట అర్బన్ :** ఉద్యోగులు, కార్మికులకు పని గంటలు తగ్గించాలని మునిసిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.వి రమణ డిమాండ్ చేశారు. కార్మికులు రోజుకు 10 గంటలు పనిచేయాలని క్యాబినెట్ తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు ఆర్‌అండ్‌బి బంగ్లా వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులను బానిసలుగా మార్చి కార్పొరేట్లకు ఊడిగం చేయించుకునేందుకే ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందన్నారు.



రాయచోటి : మోకాళ్లపై నిల్చుని నిరసన తెలుపుతున్న కార్మికులు

మహిళలకు రాత్రివేళలో విధులు కల్పించడం సరైన పద్ధతి కాదని విమర్శించారు. కార్మికులకు పని భారం పెంచే 10 గంటల పని విధానాన్ని ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు లక్ష్మీదేవి, ప్రసాద్, ఎం.రమణ, మధు పాల్గొన్నారు. **రైల్వేకోడూరు :** ఎనిమిది గంటల పనిని 10 గంటలకు పెంచుతూ చేసిన నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు సి.హెచ్.చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి తహశీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెట్టుబడుదారులకు, ఉత్పత్తి పెంచాలంటే, నిరుద్యోగులను, కొత్త ఉద్యోగులు కార్మికులు తీసుకోవాలి గానీ, పాతవారితోనే, పని గంటల పెంచి, పని చేయించడం అన్యాయమన్నారు. కార్యక్రమంలో సిఐటియు ఉపాధ్యక్షులు లింగాల యానాదయ్య, నాయకులు పెంచలయ్య, కుమార్ రాజా, నాగరాజు, వెన్నెల, శిరీష, దుర్గా, ఈశ్వరమ్మ, శోభ, మణిరత్న, బొజ్జ శివయ్య, నారాయణ, జలకమనీ పాల్గొన్నారు.



రాజంపేట : నిరసన తెలుపుతున్న మున్సిపల్ కార్మికులు


రైల్వేకోడూరు : తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న కార్మికులు

పనిచేద్దాం..లక్ష్యాలు సాధిద్దాం

- కలెక్టర్ చామకూరి శ్రీధర్

ప్రజాశక్తి-రాయచోటి

వన్ ఫైల్ వన్ లైఫ్ అనే నినాదంతో రెవెన్యూ శాఖ పనిచేయాలని పుట్టుక నుంచి మరణం వరకు ప్రతి అంశంలో ముడిపడిన శాఖ రెవెన్యూ శాఖ అని పరిపాలనకు వెన్నెముక లాంటివాళ్ళు రెవెన్యూ ఉద్యోగులని కలెక్టర్ శ్రీధర్ చామకూరి పేర్కొన్నారు. కలెక్టరేట్‌లోని పిజిఆర్ఎస్ హాల్లో శుక్రవారం ఉదయం రెవెన్యూ డే వేడుకల కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పరిపాలనకు వెన్నెముక లాంటి వారు రెవెన్యూ ఉద్యోగులని పేర్కొన్నారు. రెవెన్యూడే అందరితో కలిసి జరుపుకోవడం చాలా సంతోషకరమని తెలిపారు. రెవెన్యూ సిబ్బంది అందరూ కూడా మంచిగా పని చేసి అన్నమయ్య జిల్లాకు మంచి పేరు వచ్చే విధంగా భవిష్యత్తులో పనిచేయాలని పేర్కొన్నారు. రెవెన్యూ సిబ్బందికి ఏ పని అప్పజెప్పినా పూర్తిస్థాయిలో శ్రమ పెట్టి ఆలోచించి ఆ లక్ష్యాన్ని చేరుకునే విధంగా ప్రభుత్వ లక్ష్యాలను అందుకునే విధంగా పని చేస్తున్నారన్నారు. తాను ఈ జిల్లాకు వచ్చినప్పుడు నుంచి గమనిస్తున్నానని ఏ పని చెప్పిన ఆ పని యొక్క దిశ నిర్దేశం చేస్తే ఆ పనిని అనర్గళంగా పని పూర్తి చేసి లక్ష్యాన్ని చేరుకుంటున్నారని తెలిపారు. రాష్ట్రంలో 26 జిల్లాలలో ప్రభుత్వ పథకాల అమలు తీరులో చాలా పథకాలలో జిల్లా మొదటి స్థానంలో ఉండడం గర్వించదగ్గ విషయమని దీని వెనుక మీ అందరి కృషి కూడా ఉన్నదని తెలిపారు. ప్రభుత్వ కార్యక్రమాలలో 60 నుండి 70 శాతం పనులు రెవెన్యూ శాఖకు సంబంధించినవే ఉంటాయని, అందులో రెవెన్యూ సమస్యలు కూడా అధికంగానే ఉంటాయని వీటిని పరిష్కరించేందుకు రెవెన్యూ సిబ్బంది క్రమ శిక్షణతో పనిచేయాలని తెలిపారు. వన్ ఫైల్, వన్ లైఫ్‌గా రెవెన్యూ సిబ్బంది భావించాలని తెలిపారు. ౦వెన్యూ శాఖకు ఉన్న గొప్పతనమే కాదు లోపాలను కూడా సరిదిద్దుకోవాలని కలెక్టర్ సూచించారు. ప్రజలు నుండి వచ్చే రెవిన్యూ సమస్యలను పరిష్కరించేందుకు, రెవెన్యూ శాఖలో జాప్యం ఎక్కువగా ఉందని అపోహను తొలగించు కునేందుకు టెక్నాలజీని ఉప యోగించుకుని, ఎప్పటి కప్పుడు శిక్షణ పొంది ప్రజల సమస్యలను పరిష్కరించి ప్రజలకు ఒక నమ్మకాన్ని కలిగించే విధంగా రెవెన్యూ శాఖ సిబ్బంది పనిచేయాలని అన్నారు. అదేవిధంగా కింది స్థాయి సిబ్బంది రెవెన్యూ శాఖ సేవలు, రెవెన్యూ శాఖకు సంబంధించిన వివిధ అంశాల పై అవగాహన కలిగి ఉండాలని, వారి వద్ద వచ్చే ప్రజలకు సరైన గైడ్ చేసి వారి సమస్యను త్వరితగతిన పూర్తి చేసేందుకు సహకరించాలన్నారు.



సమావేశంలో మాట్లాడతున్న కలెక్టర్ శ్రీధర్

ప్రజలు సమస్యలను తెలిపేందుకు కార్యాల యాలకు వస్తే వాటిని కూర్చోబెట్టి మర్యాదపూర్వకంగా మాట్లాడి వారికి సరైన సలహాలు సూచనలు చేసి ప్రజలను సంతృప్తి పరచి వారికి వారికి భరోసా కల్పించే విధంగా సిబ్బంది పనిచేయాలని తెలిపారు. ఈ సందర్భంగా రెవెన్యూ శాఖ అన్ని శాఖలకు తల్లిలాంటి శాఖ అన్నారు. ఏ కష్టం వచ్చినా రెవెన్యూ శాఖ ముందు ఉంటుం దన్నారు. పరిపాలనలో రెవెన్యూ ఉద్యోగులు కీలక పాత్ర పోషిస్తారన్నారు. పుట్టకనుంచి మరణం వరకు ప్రతి అంశం రెవెన్యూతో ముడిపడి ఉంటుం దన్నారు. రెవెన్యూ శాఖ ఎంత పురాతనమైనది ఏ విధంగా ఏర్పడింది దాని ప్రాముఖ్యత, రికార్డులు నిర్వహణ సిబ్బంది పనితీరు, క్రమశిక్షణ, సమాజంలో వారి ప్రాముఖ్యత భూత భవిష్యత్తు వర్తమానాలలో ఏ విధంగా విధులు నిర్వహించారని విషయాలను సలహాలను, సూచనలను జెసి, డిఆర్‌ఒ, రాయచోటి ఆర్‌డిఒ, రెవెన్యూ రిటైర్డ్ ఉద్యోగులు తెలిపారు. రెవెన్యూ డే కలెక్టర్, జాయింట్ కలెక్టర్, మదనపల్లి సబ్ కలెక్టర్ లు భారీ కేక్‌ను కట్ చేశారు. ఈ సందర్భంగా సీనియర్ ఉద్యోగులను, పదవి విరమణ పొందిన రెవెన్యూ ఉద్యోగులను మరియు ఉత్తమ సేవలు అందించిన రెవెన్యూ శాఖ వివిధ హోదాలలో పనిచేస్తున్న సిబ్బందికి ప్రశంసా పత్రం, శాలువాలతో కలెక్టర్ సన్మానించారు. కార్యక్రమంలో జెసి ఆదర్శ్ రాజేంద్రన్, మదనపల్లి సబ్ కలెక్టర్ మేఘ స్వరూప్, డిఆర్‌ఒ మసూదన్‌రావు, రాయచోటి ఆర్‌డిఒ శ్రీనివాసులు, రాయచోటి తహశీల్దార్ నరసింహ కుమార్, కలెక్టరేట్ ఉద్యోగులు, తహశీల్దార్లు, రెవెన్యూ ఉద్యోగులు, తదితరులు పాల్గొన్నారు.

పోలీసు జాగిలం జాకీ మృతి

- అధికార లాంఛనాలతో అంత్యక్రియలు


అధికార లాంఛనాలతో జాకీకి అంత్యక్రియలు నిర్వహిస్తున్న పోలీసులు

ప్రజాశక్తి-కలకడ

జిల్లా పోలీసు శాఖలో విధులు నిర్వహించిన పోలీసు జాగిలం జాకీ(9) శుక్రవారం మృతి చెందింది. అనే శునకానికి లాంచనాలతో అంత్యక్రియలు మండలంలో శుక్రవారం నిర్వహించారు. మండల కేంద్రమైన కలకడలోని పోలీసుస్టేషన్ ఆవరణంలో జాకీకి అధికార లాంఛనాలతో ఘనంగా అంత్యక్రియలు నిర్వహించారు. జాకీ బెల్జియం మిలీనియస్ అనే సంతతికి చెందినది. మొదట జిల్లా కేంద్రమైన కడపలో ఉండేది. జిల్లాల పునర్విభజన తర్వాత అన్నమయ్య జిల్లాకు కేటాయించారు. అప్పటి నుంచి రాయచోటి ఎస్‌పి కార్యాలయంలో ఉన్నట్లు వాల్మీకిపురం సిఐ ప్రసాద్ బాబు తెలిపారు. జాకీకి నాలుగు రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ ఉండటంతో రాయచోటి, పులివెందుల సూపర్ స్పెషాలిటీ పశువైద్యశాలలో వైద్యం చేయించినప్పటికీ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు పేర్కొన్నారు. గతంలో ఎర్రచందనం చందనానికి సంబంధించిన నాలుగైదు కేసులలో ప్రతిష్టాత్మకంగా వ్యవహరించిందని తెలిపారు. ఈ జాగిలం హైదరాబాద్ నగరానికి చెందిన మహినోబాద్‌లో శిక్షణ పొందినట్లు తెలిపారు ఆ సమయంలో గోల్డ్ మెడల్ సాధించినట్లు తెలిపారు. కార్యక్రమంలో రాయచోటి ఆర్ఐ పెద్దయ్య, కలకడ ఎఎస్ఐ శంకర్ నాయక్, హెడ్ కానిస్టేబుల్ కంబెల్ల రమేష్ కుమార్, డాగ్ స్క్వాడ్ సిబ్బంది, ఎఆర్ సిబ్బంది పాల్గొన్నారు.

కళ్లకు గంతలు కట్టుకుని కార్మికుల నిరసన


కళ్లకు నల్లరిబ్బన్ కట్టుకుని నిరసన తెలుపుతున్న కార్మికులు

ప్రజాశక్తి-మదనపల్లె

సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు చేస్తున్న నిరవధిక సమ్మెలో భాగంగా 17వ రోజు శుక్రవారం మున్సిపల్ కార్యాలయం వద్ద కళ్లకు నల్లరిబ్బన్లు కట్టుకుని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఇంజినీరింగ్ కార్మికుల జెఎసి నాయకులు ఎం.ఎస్.కన్నయ్య మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని మున్సిపాలిటీలలో సమానంగా నిరసనలు కొనసాగుతున్నా, ప్రభుత్వం మాత్రం పట్టనట్లు వ్యవహరిస్తోందన్నారు. టెక్నికల్ కార్మికులకు రూ.29,200, నాన్ టెక్నికల్ ఉద్యోగులకు రూ.24,500 వేతనం ఇవ్వాలని గతంలో ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా కార్మికులపై అన్యాయం చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. తక్కువ వేతనాలు అందుకుంటున్న మా లాంటి కార్మికులకు ప్రభుత్వం సంక్షేమ పథకాలు కూడా అందించడంలేదు. ప్రభుత్వం తక్షణమే మా న్యాయమైన డిమాండ్లను పరిష్కరించకపోతే రాబోయే 22వ తేదీ నుండి రాష్ట్ర వ్యాప్తంగా సమ్మెను ఉధృతం చేసి, తాగునీరు, వీధిదీపాల సేవలను నిలిపివేసే విధంగా విధుల బహిష్కరణ చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఇంజినీరింగ్ కార్మికుల జెఎసి నాయకులు ఎస్‌కె.రెడ్డప్ప, నాగరాజు, బాబు, బాలకృష్ణ, గోపాలకృష్ణ, సజాద్, కుమార్, మహేష్ పాల్గొన్నారు.



అభ్యర్థులకు నియామక పత్రాలు అందజేస్తున్న కంపెనీ ప్రతినిధులు

ప్రాంగణ ఎంపికల్లో 112 మందికి ఉద్యోగాలు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

రాజంపేట ప్రభుత్వ ఐటిఐ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన ప్రాంగణ నియామకాలలో 157 మంది విద్యార్థులు హాజరుకాగా 112 మంది అభ్యర్థులు ఎంపికయ్యారని ఐటిఐ ప్రిన్సిపల్ రామమూర్తి తెలియజేశారు. ప్రాంగణ నియామకాలలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ఐటిఐ విద్య ఎంతో ప్రాధాన్యత సంతరించుకున్నదని, తద్వారా ఉద్యోగాలకు ఉంది ప్రగతి బాటన పయనించవచ్చునని తెలిపారు. విద్యార్థులు వచ్చిన అవకాశాలను అందిపుచ్చుకుని మరిన్ని నిలుపువలు నేర్చుకుంటూ అభివృద్ధి పథంలో నడవాలని పిలుపునిచ్చారు. ఈ ప్రాంగణ నియామకాలలో బెంగళూరుకు చెందిన ఎల్‌అండ్‌టి సంస్థ, శ్రీసిటీ చెందిన జె.వై.సొల్యూషన్స్, ట్రైచీ సంస్థలు, రాజంపేట పట్టణానికి చెందిన యాంత్రిక పవర్ (టాటా) సొల్యూషన్స్, టఫే సంస్థల ప్రతినిధులు పాల్గొని వారికి ఉపయుక్తమయ్యే అభ్యర్థులను ఎంపిక చేసుకున్నారని తెలిపారు. నియామక పత్రాలు అందుకున్న అభ్యర్థులు పరీక్షలు ముగిశాక కంపెనీలలో నియమితులవుతారని, వీరికి రూ.14 నుంచి రూ.16 వేల వరకు వేతనం లభిస్తుందని తెలియజేశారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ ఆది ప్రసాద్, రాజంపేట, పీలేరుకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు.

సంస్థాగత ఎన్నికల పరిశీలకుడిగా 'మంచూరు'

ప్రజాశక్తి-రాయచోటి

నియోజకవర్గ సంస్థాగత ఎన్నికల పరిశీలకుడిగా ఉమ్మడి కడప జిల్లా డిసిసిబి ఛైర్మన్ మంచూరు సూర్య నారాయణరెడ్డి నియమితులయ్యారు. శుక్రవారం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ అధినేత నాయకుడిగా ఎవరు ఉండాలనేది పార్టీ కార్యకర్తలే నిర్ణయించుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్న మాటలు గుర్తు చేశారు. పార్టీ కోసం నిరంతరం కష్టపడే నాయకులకు గుర్తింపు నివ్వాలనే తలంపుతో మంచి నిర్ణయం తీసుకొని ప్రతి నియోజకవర్గంలోని మండలాలకు ప్రత్యేక పరిశీలకులను నియమించి అక్కడి కార్యకర్తల అభిప్రాయాలు తెలుసుకొని సంస్థాగత ఎన్నికలు పారదర్శకంగా జరిగేలా చేశారన్నారు. రాయచోటి నియోజకవర్గం రూరల్ పరిశీలకులుగా నియమించినందుకు చంద్రబాబు, లోకేష్‌లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ అధిష్టానం తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా పనిచేస్తానని పేర్కొన్నారు. రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి సూచనల ప్రకారం రాయచోటి రూరల్‌లోని కార్యకర్తల అభిప్రాయాల మేరకు మండల, పట్టణ పార్టీ కమిటీల నియామకాలు చేపడతానని పేర్కొన్నారు.

కార్పొరేట్ పాఠశాలల కట్టడిలో విద్యాశాఖ విఫలం

ప్రజాశక్తి-రాయచోటి

జిల్లాలోని రాయచోటి, మదనపల్లి, పీలేరు, రైల్వేకోడూరు రాజంపేట, ప్రాంతాల్లో ఉన్న కార్పొరేట్, ప్రయివేట్ పాఠశాలలు విద్యార్థులకు కనీస సౌకర్యాలు మైదానం కల్పించకుండా రూ.లక్షలు విద్యార్థుల వారి తల్లిదండ్రుల నుండి పాఠశాల విద్య హక్కు చట్టం నిబంధనలకు విరుద్ధంగా అర్హత పరీక్ష పేరుతో నిర్వహిస్తూ పాఠ్యపుస్తకాలు పేరుతో దోపిడీకి గురిచేస్తూ మోసం చేస్తున్నారని పిడిఎస్‌యు రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.అంకన్న పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలో మాసాపేటలో నిరసన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిబిఎస్ఇ, ప్రైమరీ పాఠశాలలు, నవోదయ సైనిక పాఠశాలలు అనుమతి లేకపోయినా, గుర్తింపు లేకుండా పలు పాఠశాలలు కొనసాగుతున్నాయని, సొంతంగా ప్రవేట్ వసతి గృహాలు ఏర్పాటు చేసుకొని విద్యార్థులకు కనీస సౌకర్యాలు కల్పించకుండా నిర్లక్ష్యం చేస్తూ రూపాయలు వసూలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పరిరక్షించాల్సిన పాఠశాల విద్యాశాఖ ఆర్‌జెడి, డిఇఒ, డిప్యూటీ డిఇఒలు పూర్తిగా విఫలమయ్యారని ఆరోపించారు. విద్యా అధికారులు స్పందించి ఆకస్మిక తనిఖీలు నిర్వహించి ప్రభుత్వ పాఠశాలలను కాపాడాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పిడిఎస్‌యు అన్నమయ్య జిల్లా నాయకులు రవీంద్ర, మహేష్, కార్తీక్, మనోహర్ రెడ్డి, శ్రీనివాసులు, ఖాజా, సురేంద్ర పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

గ్రామ, వార్డు సచివాలయం ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కారించాలని, బదిలీలు, రేషనలైజషన్ కోసం విడుదల చేసిన జిఒ నెంబర్ 5ను రద్దు చేయాలని కోరుతూ శుక్రవారం మున్సిపాలిటీ కార్యాలయం ఎదుట సచివాలయం ఉద్యోగులు నిరసనలు తెలియజేశారు. అనంతరం సబ్ కలెక్టర్ కార్యాలయానికి వెళ్లి సచివాలయం ఉద్యోగులు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా గ్రామ, వార్డు సచివాలయం ఎంప్లాయిస్ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు గుడి నాగరాజు మాట్లాడుతూ ప్రభుత్వం తీసుకొచ్చిన ఈ జీవో సచివాలయం ఉద్యోలకు ఇబ్బందిగా మారిందన్నారు. ఈ జిఒను వెంటనే రద్దు చేయాలని కోరారు. ఈ ప్రక్రియ వలన సచివాలయం ఉద్యోగులు సొంత మండలం, మున్సిపాలిటీలలో ఉద్యోగం చేయకూడదని నిబంధన ఉందన్నారు. చిన్నస్థాయి ఉద్యోగులలైన మాకు తక్కువ జీతాలతో వేరే మండలంలో ఉద్యోగాలు చేయాలంటే కుటుంబ పోషణ భారమవతుందన్నారు. సొంత మండలం, మున్సిపాలిటీలలోనే పోస్టింగ్స్ ఇవ్వాలని కోరారు. రేషనలైజషన్ ప్రక్రియ చేసిన తరువాతనే బదిలీలు చేయాలని కోరారు. రేషన్లైజషన్‌ను ఎలా చేస్తారు, ఎవరిని చేస్తారనేది స్పష్టత లేకుండా జిఒను విడుదల చేశారని పేర్కొన్నారు. దీని వల్ల సీనియర్లకు నష్టం వాటిల్లుతుంది కావున దీనిని సవరించాలని డిమాండ్ చేశారు. రేషనలైజేషన్ ప్రక్రియ తరువాత మిగులు ఉద్యోగులను ఎక్కడ నియ మిస్తారో స్పష్టతనిచ్చిన తరువాతనే బదిలీలు చేయాలని కోరారు. ఆలస్యంగా ప్రొబేషన్ ప్రకటించినందుకు 9 నెలలు కాలానికి అరియర్స్ మంజూరు చేయా లని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సచివాలయం ఉద్యోగుల యూనియన్ నాయకులు విజకుమార్ రెడ్డి, శరత్ కుమార్ రెడ్డి, అభిషేక్, వినోద్ కుమార్, రాజారెడ్డి, హేమలత, నందిని, ఆనంద, మునిస్వామి, హరి, అధిక సంఖ్యలో సచివాలయం ఉద్యోగులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎన్నికల నమోదు అధికారి అమర్‌నాథ్‌రెడ్డి

20 పోలింగ్ కేంద్రాలు పునర్విభజన

ప్రజాశక్తి-పీలేరు

పీలేరు నియోజకవర్గం పరిధిలో 20 పోలింగ్ కేంద్రాల్లో పునర్విభజన జరగనుందని పీలేరు ఎన్నికల నమోదు అధికారి బి.అమర్నాథ్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం స్థానిక తహశీల్దారు కార్యాలయంలో నియోజకవర్గ స్థాయిలోని అన్ని మండలాల రెవెన్యూ అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులతో నెలవారి సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గం పరిధిలో ప్రస్తుతం 281 పోలింగ్ కేంద్రాలున్నాయని, వాటిలో 1200 మంది ఓటర్లు దాటిన 20 పోలింగ్ కేంద్రాలు గుర్తించడం జరిగిందని అన్నారు. వీటిలో గుర్రంకొండ మండలంలో 1, కలకడ మండలంలో 4, కె.వి.పల్లి మండలంలో 4, వాల్మీకిపురం మండలంలో 1, పీలేరు మండలంలో 10 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని చెప్పారు. ఈ 20 పోలింగ్ కేంద్రాలను క్షేత్రస్థాయిలో సిబ్బంది తనిఖీలు నిర్వహించి, వారం రోజుల్లోగా నివేదికలను తమకు అందజేయాలని, వాటిని తాము పరిశీలించి ఈ నెలాఖరులోగా జిల్లా కేంద్రానికి పంపాల్సి ఉంటుందని తెలియజేశారు. ప్రస్తుతం నియోజకవర్గం పరిధిలో 1,14,929 మంది పురుషులు, 1,19,772 మంది మహిళలు, 21 మంది థర్డ్ జెండర్ ఓటర్లు మొత్తం 2,34,722 మంది ఓటర్లు ఉన్నారని పేర్కొన్నారు. బిఎల్‌ఓలు తమ పరిధిలోని పోలింగ్ కేంద్రాల్లో 18 ఏళ్ల నిండిన యువతీ, యువకులను ఓటర్లుగా నమోదు చేసుకోవాలని, మృతి చెందిన ఓటర్లను ఓటర్లను జాబితాలోంచి తొలగించే ప్రక్రియను ఎప్పటికప్పుడు పూర్తి చేసి తప్పులు లేని ఓటర్ల జాబితాను రూపొందించాలని సూచించారు. సమావేశంలో పీలేరు తహశీల్దారు శివకుమార్, గుర్రంకొండ, కలకడ, వాల్మీకిపురం, కలికిరి, కెవి పల్లి రెవెన్యూ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఫ్యాక్షన్ రాజకీయాలను ప్రభుత్వం సహించదు : ఆర్‌జె

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి వ్యవహార శైలి ప్రజాస్వామ్యానికి ప్రమాదకరమని, ఎపిలో శాంతిభద్రతల సమస్యలు తలెత్తేలా వివాదాస్పద యాత్రలు చేస్తున్నారని టిడిపి రాజంపేట పార్లమెంటరీ అధికార ప్రతినిధి ఆర్.జె.వెంకటేష్ ఆరోపించారు. శుక్రవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్య రాజకీయాల్లో హింసకు స్థానం లేదన్నారు. వైసిపి అధికారంలో ఉన్నప్పుడు కమ్మ సామాజిక వర్గాన్ని వేధించి ఇతర వర్గాలకు దూరం చేసి, నేడు ప్రేమ వలగబోసినా ప్రజలెవ్వరు నమ్మరన్నారు. ఎపిలో కక్ష్య రాజకీయాలను రాష్ట్ర ప్రభుత్వం ఉపేక్షించదన్నారు. గతంలో ధర్మవరం పర్యటనలోను, హెలికాప్టర్ చెడిపోయిన సమయంలోను నిబంధనలకు వ్యతిరేకంగా, వేరే రూటులో వెళ్ళి వివాదాస్పదం చేశారన్నారు. పొగాకు రైతుల పరామర్శకు అనుమతి తీసుకుని అక్కడకు వేలాది మందిని తరలించి శాంతిభద్రతల సమస్యగా మార్చి వివాదాస్పదం చేశారన్నారు. సత్తెనపల్లిలో బెట్టింగులో డబ్బులు పెట్టి ఆత్మహత్య చేసుకున్న వ్యక్తి విగ్రహావిష్కరణకు వెళ్లి ఇద్దరి మరణానికి కారణమయ్యారని ఆరోపించారు. వారిని కనీసం పరామర్శించకుండా వెళ్ళిపోయి మానవత్వాన్ని మంట కలిపారని నిప్పులు చెరిగారు. రాజారెడ్డి ఆలోచనతో రాజకీయాలు చేస్తే రాష్ట్రంలో ప్రజలు సమర్థించరని హితవు పలికారు. గంజాయి, సారా బ్యాచులతో రాజకీయాలు చేస్తే విలువలు విశ్వసనీత ఉండదని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ఇలాంటి యాత్రలకు ప్రభుత్వం అనుమతులు నిరాకరించాలన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని పాతబస్తీలో కర్ఫ్యూలో ఆందోళనలో ఉన్న ప్రాంతాన్ని నేడు ప్రశాంతంగా మార్చారంటే ఆ ఘనత చంద్రబాబు నాయుడుదేనని స్పష్టం చేశారు. అధికారం కోల్పోయిన జగన్మోహన్ రెడ్డి నిరాశ నిస్పృహలతో రాష్ట్రంలో శాంతిభద్రతల సమస్యలు సృష్టించి లబ్ధిపొందాలని ప్రయత్నం చేస్తే ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరన్నారు. వైసిపి నాయకుల తాటాకు చప్పులకు భయపడేది లేదని, తెలుగుదేశం పార్టీ, కార్యకర్తలు క్రమశిక్షణతో మెలుగుతున్నారని, కార్యకర్తల మౌనాన్ని చేతగానితనంగా భావించవద్దని హెచ్చరించారు. ఇదే పద్ధతిలో ముందుకు సాగితే వైసిపీ పార్టీని అందరూ వీడి జగన్‌గా ఒక్కడివే మిగిలిపోతావని హెచ్చరించారు. సమావేశంలో టిడిపి నాయకులు నరసింహారెడ్డి, వమనోహర్‌రెడ్డి, రామాంజులు, రామచంద్ర నాయుడు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆర్.జె.వెంకటేష్

పాఠశాలకు ప్రహరీ నిర్మించండి : ఎస్‌ఎఫ్‌ఐ

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

కెజిబివి, ఎపి మోడల్ స్కూల్ స్థలం ఆక్రమణకు గురికాకుండా చుట్టూ ప్రహరీ నిర్మించాలని ఎస్‌ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు నరసింహ అన్నారు. శుక్రవారం జిల్లా సంయుక్త కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్‌కు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కెజిబివి, ఎపి మోడల్ స్కూల్ ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమణకు గురికాకుండా వెంటనే తహశీల్దార్, సర్వేయర్లను పంపి సరిహద్దులు ఏర్పాటు చేయాలని తెలిపారు. చుట్టూ ప్రహరీ గోడను నిర్మించాలని తెలిపారు. కురబలకోట మండలం నేషనల్ హైవే పక్కనే ఉన్న స్థలాన్ని రాజకీయ అండతో కాంట్రాక్టర్, రాజకీయ నాయకులు కజెయాలని చూస్తున్నారని తెలిపారు. ప్రభుత్వ స్థలాన్ని భవిష్యత్తు తరాలకు ఉపయోగించాలి తప్ప ఆక్రమణకు గురి కాకుండా చూడాలని కోరారు. కెజిబివి, ఎపి మోడల్ స్కూల్ సర్వేనెంబర్ 426లో 13.86 ఎకరాల స్థలం దాతలు పాఠశాలకు సహకరించారని ఆ స్థలాన్ని కాంట్రాక్టర్ శ్రీకాంత్‌రెడ్డి రాజకీయ నాయకులతో చేతులు కలిపి కోట్ల రూపాయలు విలువైన స్థలాన్ని ఆక్రమణ చేయాలని చూస్తున్నారని పేర్కొన్నారు. వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ స్థలాన్ని హద్దులు ఏర్పాటు చేసి చుట్టూ నాణ్యతతో కూడిన ప్రహరీ గోడ నిర్మించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి గురునాథ్, జిల్లా కమిటీ సభ్యులు జయబాబు పాల్గొన్నారు.



సాయి కీర్తన్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపల్, అధ్యాపక బృందం

సాయికీర్తన్‌కు అమరావతి విట్‌లో ఉచిత ప్రవేశం

ప్రజాశక్తి-నందలూరు

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదివిన పి.సాయి కీర్తన్ అనే విద్యార్థికి ప్రతిభ ఆధారంగా స్టార్ ప్రోగ్రాంలో భాగంగా అమరావతి విట్‌లో ఉచితంగా ప్రవేశం లభించి నట్లు కళాశాల ప్రిన్సిపల్ శ్రీదేవి పేర్కొన్నారు. ఈ సందర్భంగా శుక్రవారం ఆమె మాట్లాడుతూ సాయికీర్తన్ ఎంపిసి గ్రూపులో 957మార్కులతో జిల్లా ప్రభుత్వ కళాశాలల విభా గంలో ప్రథమ స్థానం సాధించాడని అన్నారు. తమ కళాశాల విద్యార్థులు కీర్తన్‌ను ఆద ర్శంగా తీసుకొని ఇలా ఎన్నో అవార్డులు ఉన్నత స్థానాలు పొందాలని ఆకాంక్షించారు. నందలూరు కళాశాల అన్ని విధాలుగా విద్యార్థి సర్వతో ముఖాభివృద్ధికి తోడ్పడుతుందని అన్నారు. ఈ అవకాశాన్ని స్థానికులు ఉపయోగించుకొని తమ పిల్లలను ఈ కళాశాలలో చేర్పించాలని ప్రిన్సిపల్ పిలుపునిచ్చారు. తమ విద్యార్థికి విట్ అమరావతిలో సీటు రావడం పట్ల అధ్యాపక బృందం అభినందనలు తెలుపుతూ ఆనందం వ్యక్తం చేశారు. కీర్తన్ తల్లిదండ్రులు విమలమ్మ, శ్రీనివాసులు కళాశాలపై నమ్మకం ఉంచినందుకు వారికి ధన్యవాదాలు తెలిపారు. సాయి కీర్తన్ మాట్లాడుతూ అత్యున్నత శాస్త్ర సాంకేతిక వైపుణ్యం సాధించి ఎదగాలన్నది తన ఆశయమని తన కలను సహకారం చేసుకోవడంలో చేయూతనిచ్చిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలుపుతున్నానని చెప్పారు.

ఆత్మహత్యకు పాల్పడ్డ రైతుకు..

ప్రభుత్వం సాయం అందించాలి

ప్రజాశక్తి-లక్కిరెడ్డిపల్లి

అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్న రైతు రామాంజనేయులు కుటుంబాన్ని ప్రభుత్వం తక్షణం ఆర్థిక సహాయం చేసి ఆదుకోవాలని రైతు చైతన్య ప్రచార సేవా వేదిక రాష్ట్ర కన్వీనర్ చెంచర్ల ఆంజనేయులు పేర్కొన్నారు. మండలంలోని బూడిదగుంటపల్లెకు చెందిన రైతు రామాంజనేయులు అప్పు చేసి వివిధ రకాల పంటలను సాగు చేశాడని తెలిపారు. పంట చేతికి రాకపోవడం, పెట్టుబడి కూడా రాకపోవడంతో అప్పులు తీర్చలేక కుటుంబ పోషణ కష్టమై విధి లేని పరిస్థితులో ఆత్మహత్య చేసుకున్నాడని అన్నారు. ఆయన కుటుంబం వీధిన పడకుండా వారి కుటుంబానికి ప్రభుత్వం వెంటనే రూ.50 లక్షలు ఆర్థిక సహాయం చేసి ఆదుకోవాలని కోరారు. సమావేశంలో జిల్లా కన్వీనర్ గోరిఅబ్బాస్ అలీ ఖాన్, చప్పిడి గంగులప్ప పాల్గొన్నారు.

ఐటిఐలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

స్థానిక శ్రీటిఎన్ వెంకట సుబ్బారెడ్డి మెమోరియల్ ప్రభుత్వ ఐటిఐలో రెండో విడత ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి దరఖాస్తులు చేసుకోవాలని ప్రిన్సిపల్ శ్రీనివాసులురెడ్డి తెలిపారు. ఫిట్టర్, సివిల్, ఎలక్ట్రిషియన్ ట్రేడ్లలో సీట్లు ఖాళీలు ఉన్నాయని అన్నారు. పది పాసైన విద్యార్థులు అర్హులన్నారు. iti.ap.gov.inలో జూలై 15లోగా దరఖాస్తులు చేసుకోవా లన్నారు. 17న సర్టిఫికెట్ల వెరిఫికేషన్, 21న ఇంటర్వ్యూలు ఉంటాయన్నారు.

29న కృత్రిమ కాలు సదస్సు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

చేతన ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో ఈ నెల 29న రాజంపేటలోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో కృత్రిమ కాలు (ఆర్టిఫిషల్ లింబ్స్) సదస్సు జరుగుతుందని వెలుగు సంస్థ సెక్రటరీ ఉదయ్‌మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా శుక్రవారం ఆయన మాట్లాడుతూ క్యాంపు రోజున కాలు కొలతలు తీసుకొని పది రోజులు తరువాత రూ.51వేలు విలువ చేసే ఆధునిక వెయిట్ లెస్ కృత్రిమ కాలు ఉచితంగా అమర్చబడునన్నారు. కృత్రికాలు అవసరత ఉన్నవారు, కావలసిన కార్యాలయ పని వేళల్లో ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 6గంటలలోపు పేరు నమోదు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు అశోక్ 9014110325, సుబ్బయ్య 9966475742, లక్ష్మీదేవి 6304716822 ఆర్గనైజేషన్ బై చైర్మన్ సూలం లక్ష్మీదేవిని సంప్రదించాలన్నారు. ఈ అవకాశాన్ని కృత్రిమ కాలు కావలసినవారు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



పాఠశాలలో ఉపాధ్యాయులను విచారిస్తున్న డివైఇఒ లోకేశ్వర్‌రెడ్డి

ఆదర్శ పాఠశాలలో డివైఇఒ తనిఖీ

ప్రజాశక్తి- కలకడ

మండల కేంద్రం కలకడలోని ఆదర్శ పాఠశాలను శుక్రవారం మదనపల్లి డివైఇఒ లోకేశ్వర్ రెడ్డి శుక్రవారం తనిఖీ చేశారు. పాఠశాల ప్రిన్సిపల్ మలంషావలిపై అభియోగాలు రావడంతో కడప ఆర్‌జెడి, డిఇఒ ఆదేశాల మేరకు తనిఖీలకు వచ్చినట్లు తెలిపారు. ప్రజాశక్తి దినపత్రికలో 'మధ్యాహ్న భోజనంలో పురుగులు' అనే శీర్షికతో ప్రచురితమైన వార్తకు స్పందించి తనిఖీ చేసినట్లు తెలిపారు. నిర్వహించినట్లు తెలిపారు. ఈ తనిఖీలో విద్యార్థులు, వంట ఏజెన్సీ, స్థానిక ఉపాధ్యాయులు, గతంలో పనిచేసిన ప్రిన్సిపల్ నుంచి వివరాలను సేకరించి జిల్లా ఉన్నతాధికారులకు నివేదికలను పంపనున్నట్లు తెలిపారు. అనంతరం ఆయన విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. కార్యక్రమంలో ఎంఇఒలు మునీంద్ర నాయక్, రామచంద్రారెడ్డి, స్కూల్ కమిటీ చైర్మన్ రమేష్‌నాయుడు, ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ గోవిందు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేటి నుంచి పాలిసెట్ కౌన్సెలింగ్

ప్రజాశక్తి - చాపాడు(మైదుకూరు)

పాలిసెట్ కౌన్సెలింగ్ శనివారం నుంచి ప్రారంభం అవుతుందని మైదుకూరు పాలిటెక్నిక్ ప్రిన్సిపల్ డాక్టర్ కె.వి సుబ్బారావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో సివిల్, మెకానికల్ , ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్, కెమికల్ , మెటలర్జీ , కంప్యూటర్ ఇంజినీరింగ్, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ డిప్లొమా కోర్సులలో ప్రవేశాలకు విద్యార్థులకు అవకాశం ఉందన్నారు. పాలిటెక్నిక్‌లో మైదుకూరు కళాశాలకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. అనుభవజ్ఞులైన అధ్యాపకుల నిరంతర, ప్రత్యేక , వ్యక్తిగత పర్యవేక్షణ పాలిటెక్నిక్ విశిష్టత అన్నారు. మొదటి సంవత్సరంలోనే కంప్యూటర్ ఇంజినీరింగ్ అండ్ ఇంటర్నెట్ అఫ్ థింగ్స్ డిప్లొమాలో రాష్ట్రంలోనే ప్రథమ ర్యాంక్‌ను సాధించిందన్నారు. విద్యార్థులకు హాస్టల్ వసతి ఉందని, ప్రభుత్వ నియమనిబంధనల మేరకు స్కాలర్‌షిప్, ఫీజు ఫీజ్ రీయింబర్స్‌మెంట్ సౌకర్యం ఉందని తెలిపారు.

కడప ఉక్కుపై మాట తప్పిన చంద్రబాబు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు : కడప జిల్లాలో స్టీల్ ప్లాంట్ నిర్మాణంపై ముఖ్యమంత్రి చంద్రబాబు మళ్లీ మాట తప్పారని పిసిసి అధికార ప్రతినిధి డాక్టర్ తులసి రెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. విభజన చట్టంలో 13వ షెడ్యూల్ ప్రకారం కేంద్ర ప్రభుత్వం స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో కడప జిల్లాలో ఇంటిగ్రేటెడ్ స్టీల్ ప్లాంట్ నిర్మించాలని, కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ఉంటే ఇప్పటికే నిర్మించి ఉండేదని పేర్కొన్నారు. 2018లో చంద్రబాబు ముఖ్యమంత్రి హోదాలో మైలవరం మండలంలో ఏం కంబాలదిన్నె గ్రామం వద్ద 3892 ఎకరాల్లో రాయలసీమ స్టీల్ ప్లాంట్ పేరుతో టెంకాయ కొట్టి శంకుస్థాపన చేశారు అన్నారు. తరువాత వై.ఎస్. జగన్ 2019 డిసెంబర్ 23న జమ్మలమడుగు మండలం సున్నపురాళ్లపల్లి వద్ద 3200 ఎకరాల్లో ఎపి హైగ్రేడ్ స్టిల్ కార్పొరేషన్ పేరుతో టెంకాయ కొట్టి శంకుస్థాపన చేశారని గుర్తుచేశారు.సమావేశంలో అసెంబ్లీ కాంగ్రెస్ అభ్యర్థి పూల నజీర్ కాంగ్రెస్ నాయకులు షంషీర్ పాల్గొన్నారు.

ప్రజలకు అందుబాటులో రెవెన్యూ సేవలు



రిటైర్డ్ తహశీల్దార్‌ను జయన్నను సన్మానిస్తున్న రెవెన్యూ సిబ్బంది

ప్రజాశక్తి-నందలూరు

ప్రజలకు అందుబాటులో రెవెన్యూ సేవలు ఉన్నాయని తహశీల్దార్ అమరేశ్వరి పేర్కొన్నారు. శుక్రవారం రెవెన్యూ దినోత్సవం సందర్భంగా నందలూరులోని షాదీఖానాలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ అమరేశ్వరీ మాట్లాడుతూ రెవెన్యూ అధికారులు రైతులకు, ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటారన్నారు. అనంతరం విశ్రాంత తహశీల్దార్ జయన్నను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో డివిజనల్ రెవెన్యూ సంఘం సెక్రటరీ శ్రీనివాసులు, ఎంపిటిసి సుభాన్, ఉప సర్పంచ్ ఇబ్బు, ఆర్ఐ సుశీల్, సోమిశెట్టి ప్రభాకర్, రెవిన్యూ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు. **పుల్లంపేట :** స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ దినోత్సవాన్ని తహశీల్దార్ పుల్లారెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్రిటిష్ కాలం నుంచి నేటి వరకు అధికారికంగా రెవెన్యూశాఖ ప్రజల మన్ననలు పొందుతుందని అన్నారు. రాబోయే రోజుల్లో కూడా ప్రభుత్వం అందించే ప్రతి పథకాన్ని ప్రజలకు చేరవేయాలి అన్నారు. భూమి రికార్డుల నిర్వహణ, పన్నుల వసూలు లో రెవెన్యూ సిబ్బంది పాత్ర కీలకమని తెలిపారు. అనంతరం రెవెన్యూ సిబ్బంది తహశీల్దార్ పుల్లారెడ్డిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో డిటి లక్ష్మీప్రసన్న, ఆర్ఐ రాజశేఖర్, రెవిన్యూసిబ్బంది, విఆర్ఎలు పాల్గొన్నారు. **పీలేరు:** రెవెన్యూ సిబ్బంది ప్రతి ఒక్కరూ తమ విధుల్లో అంకిత భావం చూపాలని పీలేరు తహశీల్దార్ శివకుమార్ తెలిపారు. శుక్రవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ దినోత్సవం సందర్భంగా రెవెన్యూ ఉద్యోగులు, సిబ్బందితో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించి కేక్ కోసి సం బరాలు చేసుకున్నారు. తహశీల్దారు శివకమార్ సిబ్బంది చేత ప్రతిజ్ఞ చేయిం చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రెవెన్యూ ఉద్యోగులు సిబ్బంది తమ దగ్గరికి వచ్చే ప్రజలు, రైతుల పట్ల మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని సూచించారు. ధ్రువపత్రాలు, ఇతర అవసరాల కోసం వచ్చే విద్యార్థులు, రైతులను కార్యాలయం చుట్టూ తిప్పకుండా సకా లంలో వాటిని పూర్తి చేసి వారికి సహకరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో రెవె న్యూ ఉద్యోగులతో పాటు సచివాలయ ఉద్యోగులు, విఆర్ఒలు, విఆర్ఎలు పాల్గొన్నారు.

సమిష్టి పట్టాల విభజనకు దరఖాస్తు చేసుకోండి

బి.కొత్తకోట : భూముల రీసర్వేలో రైతులు సమిష్టి పట్టాలపై ఏర్పడిన భూసమస్యల పరిష్కారానికి ఈనెల 30వ తేదీలోగా భూముల రీ సర్వే పూర్తయిన గ్రామాలలోని రైతులు వెబ్ ల్యాండ్ 2.0 జాయింట్ పట్టాలను విభజనకు దరఖాస్తు చేసుకోవాలని తహశీల్దార్ బావాజాన్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. భూముల విభజన దరఖాస్తు రుసుము రూ.500 ప్రభుత్వం మినహాయించిందని అన్నారు. కేవలం రూ.50 దరఖాస్తు రుసుముతో తమ భూములను విభజన చేసుకోవచ్చునన్నారు. ఈ అవకాశాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ఈ భూముల విభజన కార్యక్రమం ద్వారా రైతులకు అన్నదాత సుఖీభవ, తల్లికి వందనం వంటి సంక్షేమ పథకాలు పొందే అవకాశం ఉందని రైతులు గమనించాలని సూచించారు.



పుల్లంపేట : మాట్లాడుతున్న తహశీల్దార్ పుల్లారెడ్డి

ప్రజలతో స్నేహపూర్వకంగా మెలగాలి

- డిజిటల్ అసిస్టెంట్ దాడిలో గాయపడిన వారికి డిఎస్‌పి మహేంద్ర పరామర్శ



సచివాలయంలో విచారిస్తున్న డిఎస్‌పి మహేంద్ర

ప్రజాశక్తి-బి.కొత్తకోట

ప్రభుత్వ ఉద్యోగులు ప్రజల పట్ల స్నేహపూర్వకంగా మెలగాలని మదనపల్లి డిఎస్‌పి మహేంద్ర పేర్కొన్నారు.తల్లికి వందనం సమాచారం అడిగిన ప్రజలపై దురుసుగా ప్రవర్తించిన గుమ్మసముద్రం డిజిటల్ అసిస్టెంట్ బాబా ఫక్రుద్దీనుపై బి.కొత్తకోట పోలీస్ స్టేషనులో ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటి, పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. ఎస్‌సి, ఎస్‌టి కేసుపై డిఎస్‌పి మహేంద్ర శుక్రవారం గుమ్మసముద్రం సచివాలయానికి వచ్చి బాధితులను, గ్రామ ప్రజలను డిజిటల్ అసిస్టెంట్ కులాన్ని కించపరుస్తూ దాడి చేశారన్న విషయాన్ని విడివిడిగా విచారణ చేసి తెలుసుకున్నారు. అనం తరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులు ప్రజలకు సేవకులని అన్నారు. ప్రజలకు అవసరమైన సమాచారాన్ని, వారి సమస్యలను పరిష్కరించడం ఉద్యోగుల బాధ్యతని తెలి పారు. సమస్యలతో కార్యాలయాలకు వచ్చే ప్రజలపై దురుసుగా ప్రవర్తించడం, దాడి చేయ డం చట్టరీత్యా నేరమన్నారు. బాధితులకు అన్నివిధాల న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. డిఎస్‌పి వెంట బి.కొత్తకోట సిఐ జీవన్ గంగానాథ్‌బాబు, టిడిపి నాయకుడు మనోహర్ నాయుడు, సురేంద్ర పాల్గొన్నారు.

యోగాతో ఆరోగ్యం పదిలం

ప్రజాశక్తి-కలకడ

ఆసనాలతో ఆరోగ్యం సాధించ వచ్చునని ఎఎస్ఒ హుస్సేన్ తెలిపారు. సంబేపల్లి మండలం ఎస్‌సోమవారం పంచాయతీ అగ్రహారంలో యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఆసనాలను వేయించినట్లు తెలిపారు.స్థానిక అంగన్వాడీ కేంద్రంలోయోగా చేయించినట్లు తెలిపారు. ఆసనాలతో మనసు నిలకడగా ఉండి, ప్రశాంతతను కలిగి ఉండేందుకు ఎంతో దోహద పడతాయని కొనియాడారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు వేణుగోపాల్ నాయుడు, స్కూల్ కమిటీ చైర్మన్ రెడ్డప్పనాయుడు రవీంద్ర నాయుడు, పాల వెంకటరమణ, విఆర్ఒ సౌజన్య, అగ్రహారం హరిజ న వాడ అంగన్వాడీ కార్య కర్తలు, సహా యకులు అంజనమ్మ, సుజాత, సరస్వతి, సులోచన, గ్రామస్తులు పాల్గొన్నారు. **కలికిరి:** యోగాతో శారీరకంగా, మానసికంగా ఆరోగ్యంగా ఉంటారని ఐసిడిఎస్ సూపర్వైజర్ అరుంధతి అన్నారు. యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా గుట్టపాలెం కస్బాలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు, సచివాలయ సిబ్బంది, అంగన్వాడీ కార్యకర్తలతో కలిసి ఆమె యోగా కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ తిమ్మారెడ్డి, సచివాలయం సిబ్బంది, అంగన్వాడీ కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.



కలికిరి: యోగాసనాలు వేస్తున్న రెవెన్యూ సిబ్బంది

బదిలీపై వెళుతున్న గురువులకు ఘనంగా వీడ్కోలు



బదిలీపై వెళుతున్న ఉపాధ్యాయులతో సహ ఉపాధ్యాయులు

ప్రజాశక్తి-పీలేరు

స్థానిక పట్టణంలోని అయ్యప్పరెడ్డి కాలనీలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో పనిచేస్తూ బదిలీపై వెళుతున్న ఐదుగురు ఉపాధ్యాయులను సహా ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనంగా వీడ్కోలు పలికారు. శుక్రవారం స్థానిక పాఠశాల ఆవరణంలో ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని వేర్వేరు ప్రాంతాలకు బదిలీపై వెళుతున్న ఉపాధ్యాయినులు జానం సుజాత (జీవశాస్త్రం), సంపూర్ణమ్మ(ఫిజికల్ డైరెక్టర్), శ్రీకళ (జీవశాస్త్రం), సౌజన్య (భౌతిక శాస్త్రం), విజయకుమారి(సాంఘిక శాస్త్రం)లను శాలువాలు, పూలమాలలతో సత్కరించి తమ అభిమానాన్ని చాటుకుంటూ, విద్యార్థుల విద్యాభివృద్ధి కోసం వారు అందించిన సేవలను గుర్తు చేసుకున్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఫౌజియా బేగం అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఈ ఉపాధ్యాయులు తమ విధులల్లో నిబద్ధత చూపుతూ, విద్యార్థుల చైతన్యానికి, శ్రద్ధకు, శాస్త్రీయ ఆలోచనలకు బలం చేకూర్చారని అన్నారు. గత విద్యా సంవత్సరం 10వ తరగతి పబ్లిక్ పరీక్ష ఫలితాల్లో 92శాతం ఉత్తీర్ణత సాధించడంలో వీరి పాత్ర ఎంతో ఉందని కొనియాడారు. వీరి సేవలు పాఠశాల చరిత్రలో చిరస్థాయిగా నిలుస్తాయని చెప్పారు. అనంతరం బదిలీ అయిన ఉపాధ్యాయులకు శాలువాలు కప్పి, గంధం పూసి, పూల మాలలతో ఘనంగా సన్మానించారు. జ్ఞాపికలు అందజేసి వారికి కృతజ్ఞతలు తెలుపుకున్నారు. కార్యక్రమంలో పాఠశాల బోధన సిబ్బంది వై. విజయ కుమారి, ఇంద్రాణి, స్వప్నలత, ప్రసన్న లక్ష్మి, ఉమ, దీప, గంగయ్య, రామరాజు, బోధనేతర సిబ్బంది హారిక, అంజమ్మ, విద్యార్థులు పాల్గొన్నారు. అలాగే ఇటీవలే పాఠశాలకు బదిలీపై వచ్చిన ఉపాధ్యాయులు రేణుక, మనోరంజని, సుబ్రహ్మణ్య కుమారి, నాగరాణి, వసంత, లోకనాథ రెడ్డిలకు ఉత్సాహంగా స్వాగతం పలికారు.

అంబేద్కర్ విగ్రహం ధ్వంసం దారుణం

ప్రజాశక్తి-పీలేరు

భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహం ధ్వంసం చేసిన కుల ఉన్మాదులను గుర్తించి వెంటనే అరెస్టు చేయాలని బాస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు పాలకుంట శ్రీనివాసులు డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన పీలేరులోని బాస్ కార్యాలయంలో పాత్రికేయులతో మాటాడుతూ కెవిపల్లి మండలం, గర్నిమిట్ట పంచాయతీ, మల్లారపువాండ్లపల్లె సమీపంలో నల్లగుట్ట క్రాస్ వద్ద గత ప్రభుత్వంలో దళితుల ఇండ్ల నిర్మాణం కోసం హౌసింగ్ కాలనీ మంజూరు చేయడంతో కొంత మంది దళితులు ఇంటి నిర్మాణం కోసం పునాదులు వేసి ఆ కాలనీ ఆవరణంలో డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహాన్ని ప్రతిష్ఠించి, గత మూడేళ్ళుగా అంబేద్కర్ జయంతి, వర్ధంతి కార్యక్రమాలను నిర్వహిస్తున్నారని అన్నారు. 18న రాత్రి గుర్తుతెలియని కుల ఉన్మాదులు అంబేద్కర్ విగ్రహం ధ్వంసం చేయడం చాలా బాధాకర విషయమని అన్నారు. గతంలో కూడా కెవి పల్లి మండల కేంద్రంలోని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహం చూపుడువేలును దండగలు ధ్వంసం చేసిన సందర్భాలు ఉన్నాయని గుర్తు చేశారు. ఈ ఘాతుకానికి పాల్పడిన నిందితులను త్వరగా గుర్తించి కఠినంగా శిక్షించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో బాస్ నాయకులు ముల్లంగి కృష్ణయ్య, గుండ్లూరు రవీంద్ర, ముల్లంగి గురవయ్య, సతీష్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పాలకుంట శ్రీనివాసులు

ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడులు

- శాస్త్రవేత్త డాక్టర్ వి.శిల్పకళ

ప్రజాశక్తి - చక్రాయపేట

ప్రకృతి వ్యవసాయం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చునని డాక్టర్ వి.శిల్పకళ తెలిపారు. శుక్రవారం మండలంలోని నేర్సుపల్లి గ్రామంలో రెండు రోజుల శిక్షణ కార్యక్రమంలో భాగంగా మొదటి రోజు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు ప్రకృతి వ్యవసాయంతో తక్కువ ఖర్చుతో అధిక దిగుబడి, అదనపు ఆదాయం పొందవచ్చునని చెప్పారు. ఆర్థిక, ఆరోగ్య ప్రయోజనాలు పొందవచ్చునని తెలిపారు. ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులకు మార్కెట్‌లో డిమాండ్ పెరుగుతుందని తెలిపారు. నాణ్యత పరమైన ఉత్పత్తులను పెంపొందించడం కోసం రైతులు ఎంతో కృషి చేయాలన్నారు. ట్రైకోడెర్మా సూడోమోనాస్ వినియోగం, ప్రధాన పంటలలో కాషాయల ద్వారా పురుగు, తెగుళ్ల యాజమాన్యం, జిగురు అట్టలు, లింగాకర్షక బుట్టలు, దీపపు ఎరలు, పక్షి స్థావరాలు, కంచె పంటలు, ఎర పంటలు, జీవనీయంత్రణ పద్ధతుల ద్వారా సస్యరక్షణ, గురించి వివరించారు. డాక్టర్ కె.సాయి మహేశ్వరి శాస్త్రవేత్త (సేద్య విభాగం), ప్రకృతి వ్యవసాయంలో పంటలు, రకాల ఎంపిక, బీజామృతం ద్వారా విత్తనం, నారు శుద్ధి చేయడం, జీవన ఎరువుల వినియోగం, ద్రవరూప సేంద్రియ ఎరువుల తయారీ గురించి వాటిలోని పోషకాల గురించి తెలియజేశారు. కార్యక్రమంలో ఎం. ప్రతాప్. ప్రకృతి వ్యవసాయ మాస్టర్ ట్రైనర్, ఏపీ సీఎం ఎఫ్ సిబ్బంది,రైతులు పాల్గొన్నారు.



అల్పాహారాన్ని అందజేస్తున్న క్లబ్ సభ్యులు

పేదలకు అల్పాహారం పంపిణీ

ప్రజాశక్తి-నందలూరు

పేదల కడుపు నింపుతూ వారి ఆకలిని తీర్చటం మహా పుణ్యకార్యమని ఎస్ఐ మన్నెం రామ్మోహన్ అన్నారు. శుక్రవారం నాగిరెడ్డిపల్లి గ్రామపంచాయతీ, ఆర్అండ్‌బి బంగ్లా ఆవరణంలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో కీ.శే. చెంగారిసాయి ప్రసన్న 25 జయంతి సందర్భంగా ఆమె జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యుల సౌజన్యంతో పేదలకు అల్పాహార వితరణ చేయటం జరిగింది. ఈ సందర్భంగా కార్యక్రమానికి హాజరైన కెనరా బ్యాంక్ మేనేజర్ డి.వెంకట శ్రీనివాసరావు మాట్లాడుతూ క్లబ్స్ ద్వారా చేస్తున్నటువంటి ఇలాంటి కార్యక్రమాలతో సేవ చేయటం ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలని అన్నారు. వాకర్స్ కార్యదర్శి ఉప్పుశెట్టి సుధీర్ మాట్లాడుతూ సేవాగుణంలో ఉన్న తృప్తికి మించినది లేదని ప్రతి ఒక్కరూ తెలుసుకొని తమ వంతు సాటి మానవులకు సేవ చేయటానికి ప్రయత్నం చేయాలన్నారు. తద్వారా తమ కుటుంబ సభ్యులకు ఎంతో మేలు జరుగుతుందని విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. కార్యక్రమంలో చెంగారి రామాంజనేయులు, లయన్స్ క్లబ్ అధ్యక్షులు కుర్రా మణి యాదవ్, గురు ప్రసాద్, కొత్తపల్లి రాజాచారి, రిటైర్డ్ తహసిల్దార్ జయన్న, గొబ్బిళ్ళ సుబ్బరామయ్య, ఓబిలి రామ్మోహన్‌రెడ్డి, ఆంజనేయులు, కానకుర్తి వెంకటయ్య, పాటూరు రమేష్, మట్టిబాబు పాల్గొన్నారు.



బ్యాంకుల వద్ద వేచివున్న మహిళలు

'తల్లికి వందనం' నగదు కోసం మహిళల నిరీక్షణ

ప్రజాశక్తి-రామాపురం

తల్లికి వందనం పథకం కింద మహిళల ఖాతాలో వేసిన నగదు తీసుకునేందుకు మహి ళలు భారీగా బ్యాంకుల వద్దకు చేరుకోవడంతో బ్యాంకులన్నీ రద్దీగా మారాయి. క్యూలైన్లలో మహిళలు బారులు తీరారు. మండల కేంద్రంలో ఎస్‌బిఐ, రాయలసీమ గ్రామీణ బ్యాంక్, యునైటెడ్ బ్యాంక్ కిటకిట లాడుతున్నాయి. మండలంలో 70 పాఠశాలల నుంచి 4741 విద్యార్థులు తల్లికి వందనం పథకానికి అర్హత పొందారు.

క్రైం కార్నర్



మందుబాబు చేతిలో గాయపడిన బాధితులు

మందుబాబు కత్తితో వీరంగం

-ముగ్గురికి గాయాలు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

ఇంటి ముందు గొడవ చేయొద్దని వారించిన అన్నదమ్ములపై ఓ మందుబాబు కత్తితో దాడి చేసి తీవ్రంగా గాయపరిచాడు. ఈ సంఘటన గురువారం అర్ధరాత్రి మదనపల్లె పట్టణంలో చోటు చేసుకుంది. బాధితుల కథనం మేరకు..నీరుగట్టువారిపల్లె కాట్లాటపల్లి రోడ్డు, ఆంజనేయస్వామిగుడి వద్ద నివాసముంటున్న రామాంజులు ఇంటి ముందుకు అర్ధరాత్రి ఓ మందుబాబు వచ్చి గట్టి గట్టిగా అరుస్తూ అల్లరి చేశాడు.నిద్రలో ఉన్న రామాంజులు, అతని అన్న ఆదినారాయణ, తమ్ముడు రాజశేఖర్ వచ్చి వారించారు. గొడవ చేయకుండా ఇక్కడ నుంచి వెళ్లమని సూచించారు. మద్యం మత్తులో ఉన్న ఆ గుర్తుతెలియని వ్యక్తి తన వద్ద ఉన్న కత్తితో ఆ ముగ్గురిపై కత్తితో దాడి చేసి పరారయ్యాడు. గమనించిన కుటుంబ సభ్యులు బాధితులను స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఒకటో పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వేటగాళ్ల ఉచ్చులో పడిన రైతుకు గాయాలు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్



గాయపడిన శ్రీనివాసులరెడ్డి

వన్యప్రాణులను వేటాడేందుకు వేటగాళ్లు బిగించిన కరెంటు ఉచ్చులో పడి ఓ రైతు తీవ్రంగా గాయపడ్డాడు. శుక్రవారం వెలుగు చూసిన ఘటనపై అటవీ శాఖాధికారుల కథనం మేరకు.. నియోజకవర్గం, పెద్దమండెం మండలం, దిగువపల్లికి చెందిన రైతు వి.శ్రీనివాసులు రెడ్డి తన వ్యవసాయ పొలానికి వెళ్లాడు. పొలం గట్టుపైన వేటగాళు తీసిన కరెంటు ఉచ్చులో పడి తీవ్రంగా గాయ పడ్డాడు. కుటుంబీకులు గమనించి బాధితున్ని వెంటనే మదనపల్లె ప్రభు త్వాస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు ప్రథమ చికిత్స అనంతరం పరిస్థితి విషమంగా ఉండడంతో తిరుపతికి రెఫర్ చేశారు. కేసు దర్యాప్తులో ఉంది.

ఘర్షణ కేసులో ఇద్దరు అరెస్టు

ప్రజాశక్తి-రామసముద్రం

దారికాచి గొడవ చేసిన కేసులో మరో ఇద్దరిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ రమేష్‌బాబు తెలిపారు. ఈనెల 8న ఆర్.నడింపల్లి పంచాయతీ శ్రీరాములపల్లిలో జరిగిన గొడవ కేసులో మరో ఇద్దరు నిందితులు కొలగిరి వెంకటప్ప, వెంకటరమణ అలియాస్ చిన్నప్పయ్యను అరెస్టు చేసినట్లు తెలిపారు. మిగిలిన ఇద్దరు నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టినట్లు ఆయన తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



శ్రీనాథ్ (ఫైల్ ఫొటో)

ప్రజాశక్తి-పీలేరు : రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందిన సంఘటన పట్టణ శివారులో చోటుచేసుకుంది. శుక్రవారం రాత్రి స్థానిక చిత్తూరు-కడప జాతీయ రహదారిలోని మోడల్ కాలనీ సమీపంలో చోటు చేసుకున్న ఘటనలో మృతుడి వద్ద లభించిన ఆధార్ కార్డ్ ఆధారంగా పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. కలికిరి మండలం, టి.వడ్డిపల్లికి చెందిన వేముల వెంకటరమణ కుమారుడు శ్రీనాథ్ ద్విచక్ర వాహనాన్ని ఐచర్ లారీ ఢీకొనడంతో యువకుడి తలకు బలమైన గాయమై రోడ్డుపై అపస్మారక స్థితిలో పడిపోయినట్లు తెలిపారు. స్థానికులు 108 వాహనానికి సమాచారం అందించి పట్టణంలోని ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రికి తరలించారని అన్నారు. బాధితుడిని పరిశీలించిన వైద్యులు అతను అప్పటికే మృతి చెందాడని ధ్రువీకరించినట్లు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు. ఈఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ యుగంధర్ తెలిపారు.